సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 20 । మే । 2025



మానవత్వంతో సమస్యలు పరిష్కరించాలి - 8లో

పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను మానవతా దృక్పథంతో ఆలోచన చేసి పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు.



చెక్ డ్యామ్‌ల పనులు పూర్తికావాలి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెక్ డ్యామ్‌లు, క్యాస్కేడింగ్స్, చెరువుల పనులు ఆరు వారాల్లో పూర్తికావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. - 8లో

కొత్త బాధ్యతలు



దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జల్లా అధ్యక్షుడిగా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు నియామకమయ్యారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని.తనకు బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్‌రీల్

పెళ్లికి వచ్చి మృత్యుఒడిలోకి..

- స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు యువకులు
- మరణంలోనూ వీడని స్నేహం
- పెళ్లి ఇంట విషాదం
- శోకసంద్రంలో పులిగుమ్మి వాసులు



సాకి గెడ్డ వద్ద యువకుల మృతదేహాలు



నగిరెడ్డి రాము (ఫైల్)



బొత్స ఈశ్వర్‌కుమార్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: స్నేహితుడి అక్క వివాహంలో పాల్గొనేందుకు స్నేహితులతో కలిసి సరదాగా వచ్చారు. స్నానం కోసం వెళ్లిన ఐదుగురు యువకుల్లో ఇద్దరు మృత్యు ఒడికి చేరుకున్నారు. ఈ విషాదకర ఘటనతో పెళ్లి ఇంట విషాదం అలముకుంది. పార్వతీపురం మండలం పులిగుమ్మిలోని సాకిగెడ్డ తీరం కన్నీటి సంద్రంగా మారింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మండలంలోని పులిగుమ్మి గ్రామంలో బుధవారం జరగనున్న వివాహ వేడుకకు ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతానికి చెందిన 20 మంది బంధువులు పెళ్లి కుమార్తె తరఫున సోమవారం పులిగుమ్మి గ్రామానికి చేరుకున్నారు. సాయంత్రం గ్రామ శివారులో ఉన్న సాకి గెడ్డలో స్నానం చేసేందుకు వెళ్లిన ఐదుగురులో తొలుత గెడ్డలో దిగిన నగిరెడ్డి రాము (16) బొత్స ఈశ్వర్ కుమార్(16) అనే ఇద్దరు యువకులు ఈతరాక నీటిలో మునిగి మృతి చెందారు. వెంటనే మిగిలిన ముగ్గురు స్నేహితులు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో గెడ్డలో యువకులను వెతికి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందడంతో పార్వతీపురం గ్రామీణ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన వారే..

మృతి చెందిన ఇద్దరు యువకులలో నాగిరెడ్డి రాము విజయనగరం జిల్లా రేగిడి మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన వాడుకాగా, మరో మృతుడు బొత్స ఈశ్వర్‌కుమార్ బలిజిపేట మండలం సుభద్ర గ్రామం. 20 సంవత్సరాల కిందట మృతుల తల్లిదండ్రులు బతుకుతెరువు కోసం ప్రస్తుత ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతానికి వెళ్లిపోయారు. మృతి చెందిన ఇద్దరూ ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశారు. అందివచ్చిన కుమారులు అందని లోకాలకు వెళ్లిపోయారంటూ తల్లిదండ్రులు కన్నీరుపెట్టారు. ఘటనా స్థలాన్ని పార్వతీపురం రూరల్ పోలీసులు సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

మార్కెట్‌కు మన్యం పైనాపిల్



- ఏజెన్సీలో ఆరంభమైన పైనాపిల్ సీజన్
- ఏటా 25 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి
- ఒక్కో పైనాపిల్ ధర సరాసరి రూ.15, పట్టణాల్లో రూ.30కి విక్రయం
- వ్యాపారులు గ్రామాలకు వచ్చి కొనుగోలు
- ఒడిశాలోని సిమ్లిగూడ, విశాఖపట్నం ప్రాంతాలకు తరలింపు



కుమ్మరిగండిలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పైనాపిల్

సీతంపేట:

గిరిజన రైతులకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే పైనాపిల్ సీజన్ ఆరంభమైంది. ఈ నెల నుంచి ఆగస్టు వరకు పంట సీజన్ కొనసాగుతుంది. మన్యంలో సుమారు 10వేల హెక్టార్లలో పంట విస్తరించి ఉంది. దాదాపు 25వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని గిరిజనుల అంచనా. ప్రస్తుతం సరాసరి ఒక్కో పండు రూ.15 ధర పలుకుతోంది. మరికొద్ది రోజుల్లో వారపు సంతలకు పంట ఉత్పత్తులు తరలిస్తామని రైతులు చెబుతున్నారు. గతేడాది సీజన్ ఆరంభంలో రూ.20 ధర పలికినా.. సీజన్ ముగిసే నాటికి రూ.5కు పడిపోయింది. దీంతో గిరిజనులు నష్టపోయారు. అప్పట్లో ఐటీడీఏ చొరవతో గిరిజనుల వద్ద నుంచి రూ.12 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేసి బయట మార్కెట్లో విక్రయించారు. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో రూ.15కు విక్రయిస్తున్నామని, సీజన్ ఆఖరుకు ఎంత ధర పడిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొండపోడు వ్యవసాయంలో సాగు...

సీతంపేట ఏజెన్సీలో కొండపోడు వ్యవసాయంలో భాగంగా అంతర పంటగా పైనాపిల్‌ను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సింహాచలం రకం ఎక్కువగా సాగు చేశారు. కేరళ రాష్ట్రానికి చెందిన క్యూ రకం కూడా కొన్నిచోట్ల సాగులో ఉంది. కుమ్మరిగండి, సారంగి, కుశిమి, ముత్యాలు, శంభాం, అక్కన్నగూడ, రాజన్నగూడ, జోగ్గైనాయుడుగూడ, కోడిశ, తొత్తడి, రామానగరం, అంటికొండ, పొల్ల, దోనుబాయి, మానాపురం, తదితర గిరిజన గ్రామాల్లో ఇప్పుడు విస్తారంగా పైనాపిల్ పంట పండుతోంది. పంట సాగుకు తక్కువ పెట్టుబడి కావడంతో అధిక మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వ్యాపారుల మన్యంబాట..

ఏజెన్సీలో పండే పైనాపిల్ రుచి, నాణ్యతలో మేటి. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో ఒడిశాతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి పంటను కొనుగోలుచేస్తారు. కొందరు వ్యాపారులైతే ముందుగానే రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఒక్కో పండుపై కనీసం రూ.10 నుంచి రూ.15 వరకు లాభాలు వస్తాయన్నది వ్యాపారుల మాట. కొన్ని సందర్భాల్లో ఒక్కోపైనాపిల్ పండును రూ.30 వరకు పట్టణాల్లో విక్రయిస్తారు.

గత ప్రభుత్వ చర్యలతో గిట్టుబాటు ధర

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ పండిన పైనాపిల్ పంటను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు తదితర జిల్లాల్లో 41 రైతు బజార్లకు తరలించేది. రైతు సంఘాల గ్రూపుల ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకునేది. దళారీ వ్యవస్థ ఉండేది కాదు. పంట సీజన్ ముగిసేవరకు గ్రేడ్‌ను బట్టి ఒక్కో పండు రూ.15కు ఎఫ్‌పీవోలు కొనుగోలు చేసేవారు. దీంతో రైతులకు మంచి ఆదాయం వచ్చేది. ప్రస్తుతం అలాంటి చర్యలేవీ కనిపించడం లేదని, కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ధరలు పెంచితే బాగుంటుంది



పైనాపిల్ పంటే గిరిజనులకు ప్రధాన ఆదాయవనరు. సీజన్ ఆరంభంలో ఒక్కో పండును రూ.15కు విక్రయిస్తున్నాం. ఈ సంవత్సరం రూ.20 పైన ధర పలికితే బాగుంటుంది. గ్రామాలకు వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తుండడం, ముందుగా అడ్వాన్సులు ఇవ్వడంతో వారికే విక్రయాలు జరుపుతున్నాం.

– ఎస్.రామన్న, కుమ్మరిగండి

మద్దతు ధర కల్పించాలి



పైనాపిల్‌కు ప్రభుత్వ పరంగా మద్దతు ధరలు కల్పించాలి. గత సంవత్సరం కంటే ఈ ఏడాది దిగుబడి బాగా ఉంటుందని ఆశిస్తున్నాం. సంతల్లోకి తెచ్చి విక్రయిస్తుంటే ఒక్కో పైనాపిల్ సీజన్ ఆఖరులో రూ.5కు పడిపోయిన సందర్భాలున్నాయి.

– ఎస్.ఫల్గుణరావు, పొంద్ర

గిరిజన సంతలు ఇలా..

పైనాపిల్ వ్యాపారం సంతల్లో కూడా జోరుగా సాగుతుంది. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, దోనుబాయిలో గురువారం, పొల్ల, కుశిమిలలో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఇక్కడకు వ్యాపారులు వచ్చి పంటను కొనుగోలు చేస్తారు. కొన్నిసార్లు వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యతను బూచిగా చూపి పంటను చౌకగా దోచుకుంటారన్నది గిరిజన రైతుల ఆరోపణ.

ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేసిన సంగతిని గుర్తుచేశారు. అందులో భాగంగా పాలకొండ, పార్వతీపురంలో ఏర్పాటు చేస్తున్నామని, సాలూరు, కురుపాం నియోజక వర్గాల్లో స్థలాలు గుర్తించినప్పటికీ, ప్రారంభించాల్సి ఉందన్నారు. పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్థితిని సమీక్షిస్తూ శిక్షణ పొందిన లబ్ధిదారుల డేటాను వేరు చేసి సంబంధిత ఎంపీడీఓ, ఏపీఎం, క్లస్టర్ కోఆర్డినేటర్లు, సంక్షేమ సహాయకులకు తెలియజేయాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులు ఆమోదం తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు మొత్తం 97 దరఖాస్తులను స్వీకరించామని, వాటిలో ఏపీపీసీబీ వద్ద మూడు, ఫ్యాక్టరీల వద్ద ఒకటి, లీగల్ మెట్రాలజీ విభాగం వద్ద మూడు వెరసి మొత్తం ఏడు పెండింగ్ మినహా మిగిలిన 90 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్టు పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కలెక్టర్‌కు వివరించారు. 2022 ఏప్రిల్ 4 నుంచి ఇప్పటి వరకు 398 దరఖాస్తులకు అనుమతులు జారీ కాగా 94 యూనిట్లు గ్రౌండింగ్ అయినట్లు చెప్పారు. పీఎం విశ్వకర్మ కింద జిల్లా వ్యాప్తంగా 25,493 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1,253 మందికి శిక్షణ ఇచ్చామని, 76 మందికి రుణాలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, సహాయ సంచాలకులు పి.సీతారాము, రామకష్ణ, ఐపీఓ కిరణ్, డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎన్.విజయ్‌స్వరూప్, నాబార్డు ఏజీఎం దినేష్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 4,215.30 కోట్లతో పీఎల్ క్రెడిట్ ప్లాన్



ప్రొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్ : జిల్లాలో రూ.4,215.30 కోట్లతో ప్రొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్ 2025–26 ను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విడుదల చేశారు. నాబార్డు రూపొందించిన క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో విడుదల చేశారు. ప్రాధాన్యతా రంగాలకు రుణాలు పెంచడం, మౌలిక సదుపాయాల అంతరాలను తగ్గించడం, స్థిరమైన– సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ఈ ప్రణాళికలో ప్రాధాన్యమిచ్చామన్నారు. మొత్తం రుణసామర్థ్యం రూ. 4,215.30 కోట్లు కాగా, ఇందులో మౌలిక సదుపాయాలు, అనుబంధ రంగాలకు రూ.3,316.04 కోట్లు, ఎంఎస్‌ఎంఈలకు రూ.386.69 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.221.40 కోట్లు, విద్యకు రూ. 21.68 కోట్లు, ఎగుమతి క్రెడిట్ రూ.5.10 కోట్లు, పునరుత్పాదక ఇంధనానికి రూ.25.24 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు రూ.107.24 కోట్లు, ఇతర రంగాలకు రూ.131.90 కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా పరిశ్రమల అధికారి కరుణాకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయస్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

సంకిలి చక్కెర కర్మాగారం పనిచేస్తుంది

- స్పష్టంచేసిన కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: సంకిలి చక్కెర కర్మాగారం యథావిధిగా పనిచేస్తుందని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్మాగారాన్ని నడిపించేందుకు, సాగు విస్తీర్ణం పెంచేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న సంకిలి ఏకైక చక్కెర కర్మాగారంలో డిసెంబర్‌లో చెరకు గానుగ ప్రారంభమై మార్చి వరకు జరుగుతుందన్నారు. చెరకు సాగును బట్టి సుమారు 2 లక్షల నుంచి 2.5 లక్షల టన్నుల వరకు చెరకు క్రషింగ్ జరుగుతుందన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్యామలాంబ తొలేళ్ల ఉత్సవం



అమ్మవారి ముత్యాల బుట్ట

- నేడు సిరిమాను ఊరేగింపు

సాలూరు: శ్యామలాంబ అమ్మవారి పండగలో రెండో రోజైన సోమవారం తొలేళ్ల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవానికి భక్తులు పోటెత్తారు. మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాలు, కోలాట ప్రదర్శనల నడుమ జన్నివారి గద్దె నుంచి ఘటాలను పెదకోమటిపేట గద్దె వద్దకు తీసుకొచ్చారు. అక్కడ పూజలు అనంతరం జన్నివానితో కలిసి అన్ని వీధుల్లోనూ ఘటాలను ఊరేగింపు చేశారు. అక్కేనవీధిలోని పూజును, ముత్యాల బుట్టను(పాలజంగిడి) తీసుకుని రావడంతో తొలేళ్ల ఉత్సవం ప్రారంభమయింది. పెద్దలు మేళతాళాలతో యువరాజును తీసుకురాగా ఆయన సమక్షంలో పూజు, పాలజంగిడి, అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. భక్తుల జై శ్యామలాంబ నామస్మరణ నడుమ పెద్దల సమక్షంలో పూజు, పాలజంగిడిని ఊరేగింపు చేశారు. పూజు కర్రను యువరాజు పెదకోమటిపేట వద్ద ఉన్న అమ్మవారి గద్దెకు చేర్చడంతో తొలేళ్ల ఉత్సవం ముగిసింది. మంగళవారం మధ్యాహ్నం జరగనున్న సిరిమాను ఉత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు సన్నద్ధమవుతున్నారు.



యువరాజును తీసుకువస్తున్న పెద్దలు



పూజును ప్రజలకు చూపిస్తున్న పెద్దలు



భక్తుల కోలాహలం

శ్యామలాంబ తల్లి సేవలో డీవీజీ

సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు దంపతులు

బీసీలంటే అంత చులకనా?

- మహిళలన్న సానుభూతి లేకుండా తహసీల్దార్, మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కన్నీరు పెట్టించారు..
- బుల్డోజర్ ఎమ్మెల్యే విజయచంద్ర హయాంలో సెటిల్మెంట్లు, దందాలు, ఆక్రమణలే..
- పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సాక్షి, పార్వతీపురం మన్యం:

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు బీసీలంటే చిన్నచూపు ఉందని... కనీసం మహిళలన్న సానుభూతి కూడా లేకుండా వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన స్థానిక తహసీల్దార్ జయలక్ష్మిని, మున్సిపల్ చైర్‌పర్సన్‌ను వేధించి కన్నీరు పెట్టించారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 నెలల కాలంలోనే ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అవినీతి, అక్రమాల్లో ఆరితేరారని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలను పక్కన పెట్టి.. అవినీతి, అక్రమాలు, వసూళ్లు, కబ్జాలు, బెదిరింపులపైనే దృష్టి సారించారని విమర్శించారు. తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సోమవారం మాట్లాడారు. ఒక బీసీ మహిళా తహసీల్దార్‌ను అసభ్యపదజాలంతో దూషించడం దారుణమన్నారు. రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ చేయాలని మూడు నెలలుగా తహసీల్దార్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర వేధిస్తున్నారని తెలిపారు. ఆమె కొద్దిరోజుల కిందట ఎందుకు సెలవుపెట్టి వెళ్లిపోయారని ప్రశ్నించారు. అంతా సవ్యంగా ఉంటే ములగ గ్రామంలో డిజిటల్ సిగ్నేచర్‌లను ఎమ్మెల్యే చెబితే ఒక తహసీల్దార్ ఎందుకు చేయరన్నారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిని, తనది కాని భూమిని ఆన్‌లైన్‌లో పెట్టాలనడం సబబేనా అని ప్రశ్నించారు. సర్వే నంబర్ 137లో కొంత భూమిని రికార్డు ట్యాంపరింగ్ చేసి ఇన్‌కార్పొరేషన్ చేయాలని ఆమెపై ఒత్తిడి చేయడం నిజం కాదా? అని నిలదీశారు. బడిదేవర కొండ మైనింగ్ విషయంలో అక్కడ తమ ఆరాధ్య దైవం కొలువై ఉందని గిరిజనులు చెప్పినా, వామపక్షాల నాయకులతో కలసి పోరాటం చేసినా.. మైనింగ్‌కు సిఫార్సు చేయడం ఏమిటన్నారు. ఆ విషయంలోనూ తహసీల్దార్‌పై ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చారన్నారు.

బేరాలు లేవు.. రేటు ఫిక్స్

తన వద్ద బేరాల్లేవు అని చెప్పుకొంటున్న ఎమ్మెల్యే విజయచంద్ర.. ప్రతి పనికీ ఒక రేటు ఫిక్స్ చేశారని ఆరోపించారు. రేషన్ డీలర్, అంగన్‌వాడీ ఉద్యోగాలను సైతం అమ్ముకున్నట్లు పత్రికల్లో కథనాలొచ్చాయని.. తన వద్ద కూడా పూర్తి ఆధారాలున్నాయని జోగారావు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చిన అంశాల మీద వివరణ ఇస్తున్న ఎమ్మెల్యే.. ఇన్ని ఆరోపణలు వస్తున్నా ఎందుకు స్పందించడం లేదన్నారు. రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ పోస్టులను విక్రయించారా? లేదా? గోశాలలకు రూ.23 వేలు కప్పం కట్టాలంట.. నిజం కాదా? ఉపాధి వేతనదారుల నుంచి వారానికి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నది నిజమా, కాదా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్లు, అపార్ట్‌మెంట్ ఎలా వచ్చాయి?

తహసీల్దార్ జయలక్ష్మి అవినీతి చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్న బుల్డోజర్ ఎమ్మెల్యే.. మున్సిపల్ కమిషనర్ తాను డబ్బులిచ్చి, ఈ పోస్టులోకి వచ్చానని, డబ్బులు తీసుకుంటానని బహిరంగంగా చెబుతున్నా ఎందుకు స్పందించడం లేదని జోగారావు ప్రశ్నించారు. వరహాలగెడ్డ ఆక్రమణల పేరిట నోటీసులు పంపించి, ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షలు చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. 11 నెలల్లో ఎమ్మెల్యేపై ముగ్గురు బీసీ మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.. వీటి గురించి ఏ రోజూ ఎందుకు స్పందించలేదన్నారు. 'దేవుని బంద ఆక్రమణలపై నా మీద ఆరోపణలు చేశావ్.. నేను తప్పు చేస్తే దోషిగా నిలబెట్టు. దేవునిబంద విషయంలో నాడు హడావిడి చేశావ్.. ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. దాంట్లో ఆక్రమణదారులెవరు? మీ రెండు ఖరీదైన కార్లు, విజయనగరంలో అపార్ట్‌మెంట్ ఎలా కొన్నావ్.. ఏ విషయంలో బహుమతులు వచ్చాయి.. వాస్తవాలు చెప్పగలరా?' అని ప్రశ్నించారు.

బెదిరింపులు, కక్షసాధింపు మీ పాలన!

ఏమీ చేయలేక, నిరూపించలేక చివరికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద కక్ష సాధిస్తున్నారని జోగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అడ్డాపుశీలలో కూల్చివేతలు చేపట్టి, కక్షసాధింపునకు పాల్పడ్డారు.. మహిళా పారిశ్రామికవేత్త శ్రీదేవి ఇంటిని కూల్చివేశారు.. బెదిరించి అందరి బతుకులనూ నాశనం చేస్తున్నావ్.. డబ్బులివ్వడం లేదని ఈ తెగింపా?' అని ప్రశ్నించారు. సక్రమంగా నడుస్తున్న సీతానగరం చక్కెర పరిశ్రమకు ఈ దుస్థితి టీడీపీ ప్రభుత్వం వల్లే పట్టిందన్నారు. 1,25,000 టన్నుల చెరకును ఇక్కడ నుంచి రైతులు సంకిలి తరలిస్తున్నారని.. టీడీపీ వారికి అంత చిత్తశుద్ధి ఉంటే బాధ్యత పడి, ఫ్యాక్టరీని నడిపించాలన్నారు. పార్వతీపురం పరిధిలో 44 చెరువులే ఉంటే.. తాము 70 చెరువులను ఆక్రమించి రియల్‌ఎస్టేట్ వెంచర్లు వేసినట్లు అసెంబ్లీ సాక్షిగా విజయచంద్ర అబద్ధాలు చెప్పారని.. ఆ మిగిలిన చెరువులు ఎక్కడ నుంచి వచ్చాయని ఎద్దేవా చేశారు. తాను, తన బంధువులు, తన మనుషులు ఎక్కడైనా అన్యాక్రాంతం చేసినా, గ్రావెల్ చేపట్టినా దేనికైనా సిద్ధమన్నారు. ఎమ్మెల్యే చెబుతున్నవన్నీ అబద్ధాలేనన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వందరోజుల్లో మున్సిపాలిటీకి తాగునీరు, డంపింగ్‌యార్డు తరలింపు, ఖరీఫ్‌కు అడారిగెడ్డ నీరు, చక్కెర కర్మాగారం తెరిపిస్తానన్న హామీలు ఏమయ్యాయన్నారు.

'సీతానగరం వంతెన పనులు తాము చేస్తే మీ గొప్పగా చెప్పుకుంటున్నావ్.. గెడ్డలుప్పి వంతెన నీ ఘనత అంటున్నావ్.. నర్సిపురంలో 33 ఎకరాల పంటలు కోయించి, ఆ పేద రైతులకు రూ.75 వేలు ఇస్తానని చెప్పి, ఆ మొత్తం ఏం చేశావ్.. గ్యాస్ ఏజెన్సీ సంగతి ఏమిటి? విజయవాడ వరదల సమయంలో డబ్బు లు వసూలు చేసి.. బాధితులకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? ఆ డబ్బులు ఎవరి ఖాతాలకు వెళ్లాయి. ఏప్రిల్ 10న ముంబయి ఎందుకు వెళ్లావ్.. మీ దగ్గరున్న కునాల్ ఏమైనట్లు? వీటికి సమాధానం చెప్పగలవా?' అని ప్రశ్నించారు. వీలైతే నియోజకవర్గ ప్రజలకు ప్రజలకు మేలు చేయి.. కీడు తలపెట్టకని హితవు పలికారు. మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) పేరు ఉచ్చరించడానికి కూడా విజయచంద్రకు అర్హత లేదన్నారు.

బీసీలంటే ఎమ్మెల్యేకు నచ్చదేమో : చైర్‌పర్సన్

బీసీ మహిళ అయిన తహసీల్దార్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర వేధించారని, చైర్‌పర్సన్‌గా తనపైనా కక్షసాధింపునకు పాల్పడుతున్నారని పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి తెలిపారు. బీసీలంటే ఆయనకు నచ్చదేమోనని అనుమానం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశాలు కూడా పెట్టకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల ఆయనకు ఎందుకంత కోపమని ప్రశ్నించారు.

క్లుప్తంగా

పింఛన్ పెంచండి సారూ

• కలెక్టర్‌కు వేడుకోలు



కుటుంబ సభ్యుల సాయంతో కలెక్టరేట్‌కు వచ్చిన సవర సోయయ్య



ఒంటికాలితో కలెక్టరేట్‌కు వచ్చిన లోకేష్

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వంలో పింఛన్ దారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సోమవారం వస్తేచాలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు కలెక్టర్ కార్యాలయానికి నడవలేని పరిస్థితుల్లో కుటుంబసభ్యుల సహాయంతో దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. కొంతమందికి అర్హత ఉన్నా పింఛన్ రావడం లేదని, మరికొంతమందికి 90శాతం దాటి వైకల్యం ఉన్నా కేవలం రూ.6వేలే పింఛన్ ఇస్తున్నారని, తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

స్టేట్‌లెవెల్ కరాటే చాంపియన్ షిప్‌కు రాజాం విద్యార్థులు



ప్రతిభకనబర్చిన విద్యార్థులతో నిర్వాహకులు

రాజాం సిటీ: త్వరలో జరగనున్న స్టేట్‌లెవెల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు రాజాంలోని శివసైన్యం కరాటే విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ ఆర్.శివ సోమవారం తెలిపారు. ఈ నెల 18న విజయనగరంలోని రాజీవ్ ఇండోర్‌స్టేడియంలో జరిగిన పోటీల్లో కుమిటీ విభాగంలో వి.రిషిక (ప్రథమస్థానం), కాటా విభాగంలో వి.మోహిత్ (ద్వితీయ స్థానం), కె.మహేష్ (మూడో స్థానం)లో నిలిచి ఈ ఘనత సాధించారన్నారు. విద్యార్థుల ప్రతిభను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కుమిలి భాస్కరరావు(27)అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు భాస్కరరావు గ్రామంలో డబ్బులు అప్పు తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వారు తిరిగి డబ్బులు అడగడంతో మనస్తాపం చెంది సోమవారం ఉదయం ఇంటిలో ఇనుపరాడ్డుకు బెడ్‌షీట్‌ను కట్టి ఉరివేసుకున్నాడు. ఈ మేరకు గరివిడి ఎస్సై బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవులపై వికృత చేష్టలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో గోవులపై వికృత చేష్టలకు పాల్పడి, గో హత్య చేసిన వ్యక్తిని పూసపాటిరేగ పోలీసులు ఎట్టకేలకు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..కొమరాడ మండలంలోని పెళ్లిగుడ్డి కంపవలసకు చెందిన నల్లిమిల్లి చంటి (45) ఉరఫ్ మల్లేష్ గోవులపై అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లేష్ కుమిలి సమీపంలో క్వారీలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుమిలిలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే రైతు ఆవుకు తాడుతో ఉరిపెట్టి వికృత చేష్టలకు పాల్పడుతుండగా ఆవు అరవడంతో గ్రామస్తులు వచ్చి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గత నెలలో కుమిలి గ్రామంలో ఆవు రొమ్ములు, మర్మాంగాలు కోయడంతో ఆవు మృతి చెందిన విషయం విదితమే. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వ్యక్తి మల్లేష్ అని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. మూగజీవాలపై కిరాతకంగా వ్యవహరిస్తున్న మల్లేష్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత హత్య కేసును ఛేదించిన పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన వివాహిత ఎర్రాప్రగడ వెంకటలక్ష్మి (38) హత్యకేసును ఎస్.కోట పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి సీఐ నారాయణమూర్తి సోమవారం రాత్రి అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి హత్యలో మృతురాలి కుమార్తె రుచిత ప్రమేయం ఉన్నట్లు చెప్పారు. ప్రణాళిక ప్రకారం తన తల్లిని ఇద్దరు స్నేహితులతో హత్య చేయించి గ్రామ సమీపంలోని నూతిలో తోయించినట్లు చెప్పారు. పూర్తి దర్యాప్తు నిమిత్తం కుమార్తె రుచితను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితురాలిని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. వెంకటలక్ష్మి మృతిపై కుమారుడు హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

మానవత్వంతో సమస్యలు పరిష్కరించాలి

• కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం టౌన్: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం రూరల్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలను మానవతా దృక్పథంతో ఆలోచన చేసి పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆయన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి 108 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యులయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమస్య పరిష్కారం ఏ దిశలో ఉందో సెల్‌ఫోన్ మెసేజ్ ద్వారా అర్జీదారుకు తెలియజేయనున్నట్లు తెలిపారు. కావున అర్జీల పరిష్కార ప్రక్రియలో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి సమస్యకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని, అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌లో అందిన కొన్ని వినతులు

- పార్వతీపురం మండలం జగన్నాథపురం గ్రామ యవత పోటీ పరీక్షల కోసం సన్నద్ధమయ్యాలా అవసరమైన పుస్తకాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్.ప్రవీణ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.
- పాచిపెంట మండలం గంగన్న దొరకొనవలస గ్రామానికి ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5లక్షల నిధులను మంజూరు చేసినప్పటికీ గ్రామసర్పంచ్, ఎంపీడీఓ అనుమతులు మంజూరు చేయడం లేదని, కావున అనుమతులు మంజూరుపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు విన్నవించారు.
- తోటపల్లి రిజర్వాయర్‌లో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి కల్పించాలని జి.చిరంజీవి, తోట ప్రసాద్, అల్లు సురేష్, సమ్మిడి రాజేష్ వినతిపత్రం అందజేశారు.
- కొమరాడ మండలం అర్తాం రెవెన్యూ పరిధిలోని 0.3 ఎకరాల కొండ పోరంబోకు భూమిని సాగు చేసుకుంటున్నామని, ఆ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని మంజూరు చేయాలని కోరుతూ కె. కృష్ణందొర వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలైతే చట్టపరిధిలో చర్యలు

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల దర్యాప్తులో వాస్తవాలు అయినట్లయితే చట్టపరిధిలో తక్షణమే చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ఫిర్యాదు దారుల నుంచి స్వయంగా సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సంబంధించిన స్టేషన్ అధికారులకు సిఫార్సు చేయనున్నామని, ఆయా అధికారులు ఫిర్యాదులు వాస్తవాలైతే చట్టపరమైన చర్యలతో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ సిబ్బందికి ఫోన్‌లో ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, భర్త, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూలు, ప్రేమ పేరుతో మోసాలపై పలు ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. కార్యక్రమంలో 6 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. డీసీఆర్‌బీ ఎస్ఐ ఫక్రుద్దీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 46 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 46 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో పుబ్బాడ గ్రామస్తులు పద్మ గ్రామానికి సీసీ రోడ్డు వేయాలని కోరారు. రెల్లిగూడకు చెందిన బంగారమ్మ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, వరదగోడ తన గ్రామంలో నిర్మించాలని రాజమానుగూడకు చెందిన సవర చిన్నారావు విజ్ఞప్తి చేశారు. సవర నవీన్ వన్‌బీ అడంగల్ ఇప్పించాలని కోరారు. తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని కుంబికి చెందిన రామారావు వినతి అందజేశారు. వీధికాలువలు నిర్మించాలని మెట్టుగూడ గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఏఎంఓ కోటిబాబు, పీఆర్ ఏఈ కిరణ్, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా పీజీఆర్ఎస్‌కు హాజరుకావాలి

• కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్
• పీజీఆర్ఎస్‌కు 154 వినతులు



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.సెలవు కోసం ఫోన్‌లో మెసేజ్ పెట్టే వారికి షోకాజ్ నోటీసు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. సెలవు కావాల్సిన వారు ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇకపై ప్రతి శనివారం సాయంత్రం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజా వినతుల పరిష్కా వేదికకు వచ్చే నిరక్షరాస్యులకు అర్జీలను రాయడంలో సహకరించడానికి కలెక్టరేట్ నుంచి ఇద్దరు సిబ్బందిని వచ్చే సోమవారం నుంచి కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ తెలిపారు. నిరక్షరాస్యులైన వారు తమ అర్జీలను రాయడానికి దళారీలను ఆశ్రయిస్తున్నారని వారు అర్జీదారులను మభ్యపెట్టి వారి నుంచి డబ్బు తీసుకొని ప్రతి వారం కలెక్టరేట్ చుట్టు తిరిగేలా చేస్తున్నారని తెలిపారు. ఇకపై అర్జీదారులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని జిరాక్స్ కేంద్రాల్లో రాయించవద్దని కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని కలెక్టరేట్ సూచించారు. అర్జీలు రాయడానికి డబ్బులు ఇచ్చిన వారిపై తీసుకున్న వారిపై కూడా దృష్టి పెట్టాలని చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

కింది స్థాయిలోనే అర్జీలను ఇవ్వాలి

అర్జీదారులు తమ సమస్యలను ముందుగా గ్రామ స్థాయిలో లేదా మండల స్థాయిలో లేదా డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని పక్షంలో మాత్రమే జిల్లా స్థాయికి రావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఇచ్చిన అర్జీని గ్రామ స్థాయి లేదా మండల స్థాయి వారికే పంపిస్తాం కాబట్టి సమయం వృథా కాకుండా అర్జీదారు గ్రామ లేదా మండలం లేదా డివిజన్ స్థాయిలో సంప్రదించి పరిష్కారం కానప్పుడు మాత్రమే జిల్లా స్థాయిలో సమర్పించాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 188 వినతులు అందాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్, ఇన్‌చార్జ్ డీఆర్ఓ మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 35 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: పోలీస్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు సోమవారం 35 ఫిర్యాదులు అందాయి. జిల్లా అడిషనల్ ఏఎస్పీ సౌమ్యలత ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. మొత్తం వచ్చిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించి 12, కుటుంబకలహాలు 6, మోసాలకు సంబంధించి 3, ఇతర సమస్యలకు సంబంధించి 14 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సిబ్బంది సానుకూలంగా స్పందించాలని, చట్టపరిధిలో వాటిని పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేసేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, డీసీఆర్‌బీ సీఐ సుధాకర్, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

35 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

మెంటాడ: మండలంలోని పిట్టాడ చెక్ పోస్టు వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 35 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఆంధ్ర ఎస్సై కె.సీతారాం తెలిపారు. సోమవారం వేకువ జామున మండలంలోని లొతుగెడ్డ గ్రామానికి చెందిన వ్యక్తి తన జూపిటర్ ద్విచక్ర వాహనంలో అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇదే వ్యక్తి 15 రోజుల క్రితం అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

ఆరు వారాల్లో చెక్ డ్యామ్‌ల పనులు పూర్తికావాలి

• కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెక్ డ్యామ్‌లు, క్యాస్కేడింగ్స్, చెరువుల పనులు ఆరు వారాల్లో పూర్తికావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన చాంబర్‌లో జిల్లాలో చేపట్టిన జల వనరుల పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 39 చెక్ డ్యామ్‌లు, 122 చెరువులు, 40 క్యాస్కేడింగ్స్ పనులను చేపట్టేందుకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఈలోగా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. మంజూరుచేసిన పనులన్నీ ఆరు వారాల గడువులోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి త్వరగా పనులను ప్రారంభించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీలో జిల్లాకు కేటాయించిన రూ. 210 కోట్ల నిధుల్లో ప్రప్రథమంగా జల వనరుల పనులకే తొలి ప్రాధాన్యం ఇచ్చామని, తద్వారా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో ఒక్క పని కూడా ప్రారంభం కాలేదని, దీనిపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంత త్వరగా పనులు పూర్తిచేస్తే అంత త్వరగా నిధులు విడుదలవుతాయని, కావున ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు కె.రామచంద్రరావు, జల వనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్.అప్పల నాయుడు, సహాయ ఇంజినీర్లు, జూనియర్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారు మృతి



సరోజిని(ఫైల్)

పాలకొండ రూరల్: మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండ గిరిజన గ్రామంలో ఉపాధి పనులకు హాజరైన పాలక సరోజిని(54) ఆకస్మాత్తుగా మృతిచెందింది. గ్రామంలోని ఊరచెరువులో ఉపాధి పనులకు కుమారుడు నారాయణరావుతో కలసి సోమవారం ఆమె వెళ్లింది. మస్టర్లు వేయించిన తరువాత యథావిధిగా వేతనదారులు పనులకు ఉపక్రమించారు. ఈ క్రమంలో సరోజిని అస్వస్థతకు గురై వాంతులు చేసుకుంది. విషయం గమనించిన సహచర వేతనదారులు, బాధితురాలిని కుమారుడితో పాటు ఇంటికి తరలించి, 108కు సమాచారం అందించారు. వాహనం చేరుకుని సిబ్బంది పరీక్షించి సరోజిని మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఎం.విజయరంగారావు, ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ, క్షేత్ర సహాయకుడు బుల్లిబాబు మృతురాలి ఇంటికి వెళ్లి ఘటనపై ఆమె కుమారుడిని అడిగి తెలుసుకున్నారు, ఆ సమాచారం డ్వామా పీడీకి వివరించారు. మృతురాలికి భర్త పెంటయ్య ఉన్నాడు. గ్రామస్తులతో కలిసి పనులు చేస్తూ మృత్యువాత పడడంతో సహచర వేతనదారులు, గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు.

అమ్ముడు పోయిన ప్రజాస్వామ్యం

• బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌గా రాంబార్కి శరత్
• దగ్గరుండి కథ నడిపించిన ఎమ్మెల్యే బేబీనాయన.
• మాజీ మంత్రి సుజయ్



రాంబార్కి శరత్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్డీఓ, పక్కన జేసీ, కమిషనర్ తదితరులు



హాజరైన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే బేబీ నాయన

బొబ్బిలి: అధికార తాపత్రయం, అడ్డగోలుగానైనా పీఠం దక్కించుకోవాలనే కుటిల రాజకీయం వెరసి బొబ్బిలి మున్సిపల్ పీఠం టీడీపీ వశమైంది. గత నెల 29న అవిశ్వాస తీర్మానం నెగ్గిన తరువాత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎన్నికల పరిశీలకుడిగా హాజరైన ఈ ఎన్నిక ప్రక్రియను ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామమోహన రావు నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఒక్కరి పేరే నామినేట్ చేస్తూ బీఫాం అందజేయడంతో సభకు ఆర్డీఓ వివరించారు. మున్సిపాలిటీలోని 8వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న రాంబార్కి శరత్ పేరును ఒక టీడీపీ కౌన్సిలర్ ప్రతిపాదించి, మరో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ (ఎన్నికకు ముందురోజే టీడీపీ కండువా కప్పారు) బలపరుస్తున్నట్లు వారి చేతే చెప్పించారు. కోరం కోసం అవసరమైన 16 మంది మాత్రమే హాజరయ్యారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ వైస్ చైర్మన్‌గా మొన్నటి వరకూ వ్యవహరించిన 19వ వార్డు కౌన్సిలర్ చెలికాని మురళీకృష్ణ కూడా హాజరయ్యారు.

చేతులెత్తే ప్రక్రియ అవసరం లేకుండానే..

చైర్మన్ ఎన్నికకు ఒకటే ప్రతిపాదన వచ్చిందని, మరెవరైనా పోటీ చేసే అవకాశం ఉందా అని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ సమక్షంలో ఆర్డీఓ రామమోహన రావు కౌన్సిలర్లను ప్రశ్నించారు. దీనికి ఎవరూ నోరు మెదపలేదు. మరోసారి అడిగి ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత రాంబార్కి శరత్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆ వెంటనే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

రేసులో ఉన్న కౌన్సిలర్‌తోనే ప్రతిపాదన

అవిశ్వాస రాజకీయంలో దించేసిన చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు. ఈ సామాజిక వర్గానికే చైర్మన్ పదవి ఇస్తారని మొదటి నుంచి ప్రచారం సాగింది. అయితే కౌన్సిలర్లకు ఇవ్వాల్సిన, ఇతర ఖర్చుల కోసం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 6వ వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు భారీగా ఖర్చు చేశారని, ఆయన ఇప్పుడు రేసులో ఉన్నారని ప్రచారం సాగింది. అయితే దీనిని ఖండించని బేబీనాయన తదితరులు గుంభన రాజకీయాలు నడిపారు. చివరికి గెంబలి శ్రీనివాసరావు కూడా తనకు చైర్మన్ గిరీ ఇచ్చేందుకు బేబీనాయన హామీ ఇచ్చారని ఆయనే సుప్రీమ్ కనుక మరెవరు చెప్పినా జరిగే పనికాదని నాదే చైర్మన్ గిరీ అనీ ఢంకా భజాయించారు. చివరికి డొంకలో ఇరుక్కుపోయారు. ఆయనకు ప్రస్తుత చైర్మన్ రాంబార్కి శరత్ చేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడి పదవినిచ్చి మరోసారి చూద్దాంలే అని చివరి నిమిషంలో పక్కన పెట్టేశారు. అంతే కాదు. శరత్ చైర్మన్ కావడానికి సభలో నువ్వే ప్రతిపాదించాలని ఇరికించారు. దీంతో గెంబలి మరోసారి నిరుత్సాహపడక తప్పలేదు. మరో కౌన్సిలర్ రామారావు గెంబలి ప్రతిపాదనను బలపర్చారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మున్సిపల్ చైర్మన్‌గా రాంబార్కి శరత్ కౌన్సిల్ హాల్‌లో బాధ్యతలు స్వీకరించారు.

హాజరు కాని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు:

బలం ఉన్నా టీడీపీ ఆడిన ప్రలోభాలు, పైరవీల వలలో పది మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చిక్కుకున్నారు. టీడీపీకి కేవలం పది మంది కౌన్సిలర్లే ఉన్నా ప్రలోభాలతో బలం పెరగడంతో ఎన్నిక లాంఛనమే అయింది. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఈ చైర్మన్ ఎన్నిక సమావేశానికి గైర్హాజరయ్యారు.

నీతి వదిలేసిన రాజకీయాలు



ప్రస్తుత రాజకీయాలు నీతిమాలిపోయాయి. కేవలం కొద్ది రోజుల పరిపాలన కోసం స్థానిక సంస్థలను కూడా కూటమి నాయకులు నిస్సిగ్గుగా చేజిక్కించుకునేందుకు బరితెగించడం సరికాదు. దమ్ముంటే సక్రమంగా రాజకీయాలు చేయాలి. అమ్ముకునే, కొనుగోలు చేసే రాజకీయాలు చేస్తే ప్రజలు తగిన జవాబిస్తారు. వచ్చే రోజుల్లో సరైన గుణపాఠం నేర్చుకోవాల్సి ఉంటుంది.

శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే

ముగిసిన శివాలయం ప్రతిష్ట



పూజలు చేస్తున్న బ్రహ్మశ్రీ ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ



అభిషేకాలు చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురం గ్రామస్తులు, మరికొంతమంది దాతల ఆర్థిక సహాయంతో నిర్మాణం జరిగిన శివాలయం ప్రతిష్టాపన మహోత్సవాలు సోమవారం ముగిశాయి. అసంఖ్యాక దేవాలయాల ప్రతిష్టాపకుడు, వేదపండితుడు ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో 12 మంది అర్చకులతో ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని కంకణధారులు పూజా సామగ్రితో ఉదయం 5 గంటలనుంచి పూజలు ప్రారంభించారు. అనంతరం భక్తులంతా కొబ్బరి నీటితో దేవతామూర్తులకు అభిషేకాలు చేశారు. అభిషేకం చేసిన దేవతామూర్తులను సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ తిరువీధి నిర్వహించారు. 8 గంటలకు జలాభిషేకం, 9 గంటలకు ఉపనిషత్ పారాయణం జరిగాయి. ఈ సందర్భంగా వేదపండితుడు ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోనే కృష్ణారాయపురం శివాలయం ప్రశస్థమైనదన్నారు. శివాలయంలో మరకత శివలింగం ప్రతిష్టించామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్టించినట్లు చెప్పారు. ఇక్కడి స్వామివారిని దర్శించుకున్న వారు సిరిసంపదలతో తులతూగుతారని, చేసిన పాపాలు హరిస్తాయన్నారు. స్థలదాతలు పోల లక్ష్మునాయుడు, బోడెమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు, బడేశ్రీరాములు దంపతులు మహాపంచముఖేశ్వ మరకత శివలింగం ఆలయానికి సమర్పించినట్లు తెలియజేశారు.

నాలుగోరోజుకు చేరిన రిలేనిరాహార దీక్ష



ప్లకార్డులతో రిలేనిరాహారదీక్షలో పాల్గొన్న ఏజేఏసీ నాయకులు, గిరిజన నిరుద్యోగ యువత

పార్వతీపురం: ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంతాలలోని ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి ఆదివాసీలతోనే నియామకాలను చేపట్టాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి (ఏజేఏసీ) ఆధ్వర్యంలో యువత రిలే నిరాహార దీక్షను చేపట్టారు. సోమవారం ఏపీ ఆదివాసీ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఐటీడీఏ ఆవరణలో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాలుగో రోజు ప్లకార్డులతో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రిలే నిరాహార దీక్షలో కె.ధర్మారావు, ఆరిక నీలకంఠం, డి.సీతారాం, రామకృష్ణ, చంద్రశేఖర్, మల్లయ్య, గిరిధర్, సాయిబాబు, ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు టి.సత్యనారాయణ, వై.సూర్యనారాయణ, డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు విభజనకు చిన్నారుల అవస్థలు



నాయనమ్మతో కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో వేచివున్న భానుప్రసాద్ పిల్లలు

పార్వతీపురం: ఉమ్మడి కుటుంబంలో ఉన్న తమకు రెండు రేషన్ కార్డులుగా విభజించి మంజూరు చేయాలని ఫొటోలో ఉన్న చిన్నారులు తమ నాయనమ్మతో కలిసి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. గరుగుబిల్లి మండలం పెదగుడబ గ్రామానికి చెందిన సిరిపోల ఇలవేణి పెద్ద కుమారుడు భానుప్రసాద్ భార్య, వారి పిల్లలు, చిన్నకుమారుడు కలిసి ఒక కార్డులో ఉన్నారు. భాను ప్రసాద్‌కు వివాహమై ఐదు సంవత్సరాలు కావస్తోంది. పెద్దకుమారుడు భాను ప్రసాద్ వారి కుటుంబ సభ్యుల పేరున కార్డును మంజూరు చేయాలని ఎస్ఆర్‌పేట పంచాయతీ అధికారుల వద్దకు మూడు, నాలుగు సార్లు వెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ సర్వర్ పనిచేయడం లేదని బదులివ్వడంతో తమకు రేషన్‌కార్డు విభజన నిమిత్తం ఏమీ చేయలేని పరిస్థితుల్లో తల్లి ఇలవేణి, తన ముగ్గురు పిల్లలతో కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌కు సమస్యను విన్నవించారు. విభజన కాని కారణంగా తన తల్లి వితంతు పింఛన్‌కూడా మంజూరు చేయడం లేదని భాను ప్రసాద్ సాక్షికి తెలిపారు.

ఐటీడీఏ ద్వారా గిరిజన ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి




కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ సభ్యులు

పార్వతీపురంటౌన్: మెగా డీఎస్సీ నుంచి గిరిజన ప్రాంత పోస్టులు మినహాయింపు చేసి ఐటీడీఏ ద్వారా గిరిజన ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ కొండగొర్రి ధర్మారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సలహామండలి(టీఏసీ) తక్షణమే ఏర్పాటు చేసి రద్దయిన జీఓ నంబర్ మూడు స్థానంలో కొత్త చట్టం తీసుకువచ్చి గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకు వచ్చే విధమైన చట్టం తీసుకువస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని కోరారు.

విలీనం ఆలోచన విరమించుకోవాలి

• గిరివెలుగు డీఆర్‌డీఏలోకి విలీనం సరికాదు



సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.సాంబమూర్తి

పార్వతీపురం: గిరిజనులకు సేవలందించేందుకు ఐటీడీఏను ఏర్పాటు చేసి శాఖలుగా విభజించి సేవలు అందించే క్రమంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఐటీడీఏను కనుమరుగు చేసే విధంగా వ్యవహరిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.సాంబమూర్తి పేర్కొన్నారు. ఇప్పటికే గ్రీవెన్స్‌సెల్‌ను కలెక్టర్ కార్యాలయానికి తరలించి గిరిజనులు ప్రత్యేకంగా తమ గోడును విన్నవించుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని ఇదే వైఖరితో మళ్లీ ఐటీడీఏకి అనుసంధానంగా ఉండే గిరివెలుగును డీఆర్‌డీఏలో కలిపి అనుసంధానం చేసే ఆలోచన గిరిజనులకు అన్యాయం చేసేలా విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కార్యక్రమాలు నిర్వహించే గిరివెలుగును డీఆర్‌డీఏలో అనుసంధానం చేసే ఆలోచనను తక్షణమే రాష్ట్రప్రభుత్వం విరమించుకోవాలని సాంబమూర్తి అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.